రేపటి నుంచి రియల్ బాదుడు



జనంతో నిండుకున్న రాయదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



- రిజిస్ట్రేషన్ ధరలకు రెక్కలు
- 10 నుంచి 40 శాతం అధనంగా పెంపు
- ఇప్పటికే కుదేలైన రియల్ ఎస్టేట్ రంగం
- తాజా పెంపుతో మరింత పతనమేనంటున్న వ్యాపారులు

రాయదుర్గం: అడ్డగోలుగా ఆదాయం పెంచుకోవడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీలో భారీగా రిజిస్ట్రేషన్ చార్జీల బాదుడుకు సిద్ధపడింది. పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా 10 నుంచి 40 శాతం మేరకు రిజిస్ట్రేషన్ చార్జీల వసూళ్లకు కార్యాచరణ మొదలైంది. ఈ ధరలు ఫిబ్రవరి 1 నుంచి అమలులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో భూములు, నివాస, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాల విలువలు అమాంతం పెంచడంపై సామాన్య, మధ్య తరగతి వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచేది లేదంటూ కూటమి నేతలు ఎన్నికల ముందు ఇచ్చిన మాటను కేవలం ఎనిమిది నెలల్లోనే తప్పుతూ జనంపై బాదుడుకు సిద్ధమయ్యారు.

కర్ణాటక సరిహద్దున ఉన్న రాయదుర్గం నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎకరం విలువ ప్రస్తుతం రూ.8 లక్షలు కాగా క్రయ విక్రయాల సమయంలో రిజిస్ట్రేషన్ ఖర్చుల కింద ప్రభుత్వానికి రూ.1.30 లక్షలు చెల్లిస్తున్నారు. ఫిబ్రవరి 1 నుంచి రూ.1.60 లక్షలు అంటే ఎకరంపై రూ.30 వేలు అదనంగా కక్షిదారులపై ఫీజులు భారం మోపుతున్నారు. రాయదుర్గం పట్టణంలోని గజం రూ.4,500 చొప్పున సెంటు రూ.2.25 లక్షలు ఉంది. ఫిబ్రవరి 1 నుంచి పట్టణంలోని అన్ని కేటగిరీ భూముల విలువ 10 శాతం పెంచడంతో గజం రూ.5 వేలు చొప్పున సెంటు రూ.2.50 లక్షలకు పెరగనుంది. ప్రస్తుతం సెంటు స్థలం రిజిస్ట్రేషన్ వ్యాల్యుయేషన్ కింద ప్రభుత్వానికి రూ.16,875 చెల్లిస్తుండగా, ఫిబ్రవరి 1 నుంచి రూ.18,750 చెల్లించాల్సి వస్తోంది. రెండు, మూడు ఆపై సెంట్లు కొనుగోలు చేసే సామాన్య, మధ్య తరగతి ప్రజలకు రూ.5 వేల నుంచి రూ.10 వేలు అదనపు ఖర్చులు రానున్నాయి. కణేకల్లు సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో ప్రస్తుత ఎకరం విలువ రూ.10 నుంచి రూ.12 లక్షల ధర పలుకుతుంది. క్రయ విక్రయాల సమయంలో రిజిస్ట్రేషన్ ఖర్చుల కింద ప్రభుత్వానికి రూ.1.60 లక్షలు చెల్లిస్తున్నారు. ఫిబ్రవరి 1 నుంచి రూ.2 లక్షలు అంటే రూ.40 వేలు అధనంగా కట్టుకోవాలి. కణేకల్లు మండల కేంద్రంలో గజం రూ.4,500 లు చొప్పున సెంటు రూ.2.25 లక్షలు ఉంది. ఫిబ్రవరి 1 నుంచి రూ.2.50 లక్షలకు పెరుగుతోంది. రాయదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కింద 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.17,17,47,86 కోట్లు రిజిస్ట్రేషన్ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం రాబట్టాల్సి ఉంది. డిసెంబర్ ఆఖరి నాటికి రూ.13,64,66 కోట్లు మాత్రమే వసూలైంది. కణేకల్లు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో రూ.9 కోట్లకు గాను రూ.5 కోట్లు వసూలైంది. సుమారు రూ.4 కోట్లు వసూళ్లు కావాల్సి ఉంది. రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగడంతో లక్ష్యం చేరుకోవడం కష్టంగా మారింది. కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజవర్గాల్లోనూ ఇలాంటి పరిస్థితులే కనిపించాయి.

కిటకిట లాడుతున్న రిజిస్ట్రేషన్ కార్యాలయాలు

రాయదుర్గం, కణేకల్లు, కళ్యాణదుర్గం, ఉరవకొండ లోని సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాలు క్రయ విక్రయ దారులతో కిటకిట లాడాయి. శుక్రవారం ఒక్కటే పాత రేట్లతో రిజిస్ట్రేషన్లకు అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో క్రయ విక్రయదారులు ఒక్కసారిగా కార్యాలయాలను చుట్టుముట్టారు. సర్వర్ కాస్త సతాయిస్తుండడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు పత్రాలు చేతపట్టి బారులు దీరారు. దీన్ని అదునుగా తీసుకున్న ప్రైవేటు వ్యక్తులు ఒక్కో డాక్యూమెంట్‌కు ఒక్కో రీతిలో వసూళ్లకు పాల్పడ్డారు. అవసరాన్ని ఆసరాగా చేసుకుని ముక్కు పిండి వసూళ్లకు పాల్పడ్డారు. బారీగా కమీషన్లు దండుకున్నారు. దీనిపై విమర్శలు వ్యక్తం అయ్యాయి.

ఒకటి నుంచి చార్జీలు అమలు



రిజిస్ట్రేషన్లపై 10 శాతం పెంచిన చార్జీలు ఫిబ్రవరి ఒకటి నుంచి అమలులోకి వస్తాయి. ఆయా ప్రాంతాల్లోని భూములు, ఇతర ఆస్తుల విలువలను బట్టి ధరల్లో వ్యత్యాసం ఉంటుంది. చివరి రెండు రోజులు కావడంతో రిజిస్ట్రేన్ల కోసం వచ్చేవారి సంఖ్య ఎక్కువగా కనిపిస్తోంది. దళారులు, ప్రైవేట్ వ్యక్తులను అనుమతించకుండా పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు చేపట్టాం.

– కే శ్రీనివాసులు, సబ్‌రిజిస్ట్రార్, రాయదుర్గం

క్లుప్తంగా

ఉపాధి పనుల్లో పారదర్శకత ఉండాలి

- కళ్యాణదుర్గం డీఎల్‌డీఓ నాగేశ్వరరావు



టీఏ మల్లికార్జునను సన్మానిస్తున్న అధికారులు

రాయదుర్గం: ఉపాధి పనుల్లో పారదర్శకత పెరగాలని కళ్యాణదుర్గం డీఎల్‌డీఓ నాగేశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. గురువారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కొండన్న అధ్యక్షతన ఉపాధి టెక్నికల్, క్షేత్ర సహాయకులతో సమావేశం నిర్వహించారు. డీఎల్‌డీఓ మాట్లాడారు. ఉపాధి పథకం ద్వారా ప్రస్తుతం జరిగే పనులు నాణ్యత ఉండాలన్నారు. పశువుల షెడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. శుక్రవారం సాయంత్రం నాటికి శ్రమశక్తి సంఘాల జాబితా సిద్ధం చేయాలన్నారు. ఉపాధి పథకం టెక్నికల్ అసిస్టెంట్ మల్లికార్జునను సన్మానించారు.

జంతువుల సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ డీడీ వెంకటేష్

రాయదుర్గంటౌన్: జంతువులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని డివిజన్ పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరక్టర్ వెంకటేష్ పేర్కొన్నారు. గురువారం కణేకల్లు రోడ్డులోని ప్రాంతీయ పశువైద్యశాలలో జంతు సంక్షేమ పక్షోత్సవాలు నిర్వహించారు. అనిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా వారి ఆదేశాల మేరకు ఈ నెల 14 నుంచి జంతు పక్షోత్సవాలు జరిగాయి. గురువారం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. పశువైద్యశాలలో జరిగిన కార్యక్రమానికి ప్రజలు, రైతులు, సిబ్బంది హాజ రయ్యారు. అసిస్టెంట్ డీడీ నాగలింగేశ్వరరెడ్డి, పశువైద్యాధికారి సూర్య నారాయణరెడ్డి పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని జ్ఞాన భారతి పాఠశాలలో జంతు సంక్షేమ పక్షోత్సవాలను గురువారం నిర్వహించారు. నియోజవర్గం వ్యాప్తంగా ఈనెల14 నుంచి 30 వరకు జంతు సంక్షేమ పక్షోత్సవాలు నిర్వహించి, పశువులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏడీఏలు శ్రీనివాస్‌గుప్త, వెంకటేశ్వర్ మాట్లాడారు. కార్యక్రమంలో పశువైద్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కొనసాగుతున్న కక్ష సాధింపు

రాయదుర్గంటౌన్: రాయదుర్గంలో చౌక డిపో డీలర్లపై రాజకీయ కక్ష సాధింపు కొనసాగుతూనే ఉంది. వేధింపులకు తట్టుకోలేక కొందరు రాజీనామా చేయగా మరికొందరిపై 6ఏ కేసులు నమోదు చేసి తొలగించారు. పట్టణంలో ఇద్దరు డీలర్లు కోర్టును ఆశ్రయించి పోరాడుతుండగా తాజాగా పట్టణంలోని మరో ఇద్దరు డీలర్లపై స్టోర్లపై తరుచూ తనిఖీలతో రెవెన్యూ అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లోని వన్నూరమ్మకు చెందిన 15వ స్టోరును సీఎస్‌డీటీ సుదర్శనాచారి తనిఖీ చేశారు. ఈపాస్‌లో బఫర్ పరిశీలించారు. వ్యత్యాసం లేకపోవడంతో వెనుదిరిగారు.

నోట్ పుస్తకాల పేపర్లతో ఎఫ్‌ఏ-3 పరీక్షలు

శెట్టూరు: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో నోట్ పుస్తకాల పేపర్లతో ఎఫ్‌ఏ-3 పరీక్షలు నిర్వహించారు. ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు ఎఫ్‌ఏ-3 పరీక్షలు నిర్వహిస్తున్నారు. 6 నుంచి 8 వతరగతి వరకు ఓఎంఆర్ షీట్‌లలోను, 9,10 తరగతుల విద్యార్థులకు వైట్ పేపర్లను జవాబు పత్రాలుగా ఇవ్వాల్సి ఉంది. అయితే 9,10 తరగతుల విద్యార్థులు జవాబు పత్రాలు ఇవ్వక పోవడంతో విద్యార్థులు నోట్ పుస్తకాలలోని పేపర్లు చించి పరీక్షలు రాశారు. గురువారం పాఠశాలకు వచ్చిన కొందరు పిల్లల తల్లిదండ్రులు విషయం మీడియాకు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ శ్రీధర్ పాఠశాలను సందర్శించి, జవాబు బయట నుంచి తెప్పించి వైట్ పేపర్లు ఇచ్చారు. ప్రిన్సిపాల్ గాయిత్రి మాట్లాడుతూ చాలా ఏళ్లుగా యూనిట్ టెస్ట్‌లను నోట్ పుస్తకాల పేజీలతోనే నిర్వహిస్తున్నామన్నారు. క్వార్టర్లీ, ఆఫ్ ఇయర్లీ పరీక్షలకు మాత్రమే జవాబు పత్రాలు ఇస్తామన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి



జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో భోజన నాణ్యతను పరిశీలిస్తున్న మంత్రి కేశవ్

ఉరవకొండ: విద్యార్థులకు పాఠశాలల్లో నాణ్యమైన భోజనం పెట్టాలని, మెనూ ప్రకారం కోడిగుడ్డు ఇవ్వాలని మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఉరవకొండలోని ప్రభుత్వ జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మంత్రి కేశవ్ మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడారు.

గాంధీ విగ్రహానికి నివాళి..: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహం వద్ద మంత్రి కేశవ్‌తో పాటు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ నివాళులర్పించారు.

కందుల కొనుగోలులో నిబంధనలు సడలించాలి

- కలెక్టర్‌కు రైతులతో కలిసి విన్నవించిన వైఎస్సార్‌సీపీ నేతలు



జిల్లా కలెక్టర్‌తో మాట్లాడుతున్న పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, రైతు విభాగం నాయకుడు

ఉరవకొండ: కందుల కొనుగోలులో ప్రభుత్వం నిబంధనలు సడలించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాకెట్ల అశోక్, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు మోపిడి సర్పంచ్ మేకల సిద్ధార్థ్ డిమాండ్ చేశారు. గురువారం ఉరవకొండ మార్కెట్‌యార్డులో కొనసాగుతున్న కందుల కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు కలుగుతున్న ఇబ్బందులను అడిగేందుకు వెళ్లగా, వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రైతులు కలెక్టర్ ఎదుట సమస్య విన్నవించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, రైతు విభాగం అధ్యక్షులు మేకల సిద్ధార్థ్ మాట్లాడుతూ కందుల కొనుగోలులో నిబంధనలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించినా రైతులకు న్యాయం జరగడం లేదన్నారు. ఎకరాకు 2 నుంచి 3 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, ఈక్రాప్ లో కుడా అధికారులు నిర్లక్ష్యంతో 3 క్వింటాళ్లు అని నమోదు చేశారన్నారు. కనీసం ఎకరాకు 6 నుంచి 8 క్వింటాళ్లు కొనుగోలు చేస్తే రైతుకు గిట్టుబాటవుతుందన్నారు. కలెక్టర్ స్పందిస్తూ అక్కడే ఉన్నా మార్కెఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి, ఏఓ శుభకర్‌ను రైతులను ఇబ్బందులు పెట్టకుండా కొనుగోలు చేయాలని ఎకరాకు 3 క్వింటాళ్ల వరకు కాకుండా, ఎంత పంట ఉంటే అంతా కొనుగోలు చేసేలా ప్రభుత్వంతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నారాయణ కళాశాలను సీజ్ చేయాలి



బంద్‌కు పిలుపునిస్తున్న ఐక్య విద్యార్థి సంఘం నాయకులు

రాయదుర్గంటౌన్: నారాయణ కళాశాల ను సీజ్ చేయాలని, మంత్రి నారాయణను పదవి నుంచి తొలగించాలనే డిమాండ్‌లతో 31న ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల బంద్ చేస్తున్నట్లు ఐక్య విద్యార్థి సంఘం నేతలు తెలిపారు. స్థానిక ఏపీఎన్జీవో భవనంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి వంశీ, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా నాయకులు అనిల్‌కుమార్ మాట్లాడారు. ఫీజు వేధింపులతో నారాయణ కళాశాల భవనం పైనుంచి విద్యార్థి చరణ్ దూకి ఆత్మహత్య చేసుకుంటే నేటి వరకూ కేసు నమోదు చేయకపోవడం దారుణమన్నారు. జిల్లావ్యాప్తంగా శుక్రవారం జరిగే ప్రైవేట్ విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కళ్యాణదుర్గం రూరల్: అనంతపురంలోని నారాయణ కళాశాలను వెంటనే సీజ్ చేయాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్షావలి, ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, ఎన్‌ఎస్‌యూఐ, విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్షావలి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ వంశీ, ఏఐఎస్‌ఎఫ్ టౌన్ అధ్యక్షుడు మురళి, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నారాయణ విద్యాసంస్థలు సీజ్ చేసే వరకూ ఉద్యమం

ఉరవకొండ: నారాయణ విద్యాసంస్థ సీజ్ చేసే వరకూ ఉద్యమం చేస్తామని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సిద్ధూ హెచ్చరించారు. గురువారం ఉరవకొండ సీపీఎం కార్యాలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిద్ధూ మాట్లాడారు. అనంతపురంలోని నారాయణ కళాశాలలో విద్యార్థి చరణ్ ఫీజుల తీవ్ర ఒత్తిడి తాళలేక భవనం నుంచి దూకి చనిపోయినా ఉమ్మడి జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రుల్లో ఒక్కరూ స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఈ ఘటనపై విద్యాశాఖ మంత్రి లోకేష్ ఈ ఘటన కనిపించలేదా? అని ప్రశ్నించారు. నారాయణ కళాశాల యాజమాన్యం వైఖరిని నిరసిస్తూ శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, ప్రభుత్వ విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఆర్‌ఐఓ వెంకటరమణనాయక్ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఇస్తున్న కాసులకు కక్కుర్తి పడి కనీసం ఘటనపై ప్రభుత్వానికి నివేదిక కుడా ఇవ్వలేదన్నారు. నారాయణ విద్యాసంస్థలనుసీజ్ చేసి బాధ్యుల పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్ష, కార్యదర్శిలు నందు, హరూన్‌రషీద్ పాల్గొన్నారు.

గాంధీ ఆశయ సాధనకు కృషి చేద్దాం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య



మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సమన్వయకర్త రంగయ్య, పార్టీ శ్రేణులు



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

కళ్యాణదుర్గం: మహాత్ముడు చూపిన బాటలో నడుస్తూ, ఆయన ఆశయాల సాధనకు కృషి చేద్దామని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య సూచించారు. పట్టణంలోని స్థానిక గాంధీచౌక్‌లో మహాత్ముడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రంగయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాంతి, అహింస మార్గంలో నడవాలన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే గాంధీజీ కలలు కన్న స్వరాజ్యం సాధ్యమవుతుందన్నారు. గ్రామస్వరాజ్యం స్థాపన కోసం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాటుపడ్డారని గుర్తు చేశారు. గ్రామంలోనే గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్లు, పాఠశాలలు, అంగన్‌వాడీలు ఇలా ప్రజలకు కావాల్సిన ప్రతి ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోటకు తీసుకొచ్చి గాంధీజీ కలలుగన్న స్వరాజ్యం దిశగా అడుగులు వేశారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు రేవన్న గౌడ్, అధికార ప్రతినిధి గోపారం శ్రీనివాసులు, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీ తలారి సత్తి, యాక్టివిటీ సెక్రటరీ యర్రంపల్లి కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు సుధీర్, తిరుమల వెంకటేశులు, గోళ్ల సూరి, నాగరాజు, బిక్కిహరి, కౌన్సిలర్ పరమేశ్వరప్ప, ఇబ్రహీం, ఉమాపతి, హరి, పరంధామరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అప్జల్, యూత్ వింగ్ చరణ్, మహిళా విభాగం నాగలక్ష్మి, స్టూడెంట్ వింగ్ అజయ్, వలంటీర్స్ వింగ్ షేక్షావలి, లీగల్ సెల్ తలారి రామాంజనేయులు, దివ్యాంగుల వింగ్ పాతలింగ, సర్పంచు హనుమంతప్ప, ఎంఎస్ రాయుడు, లింగప్ప, నాగరాజు, రామిరెడ్డి, మురళి, హబీబ్, చిరు, జానీ, ప్రేమ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి

రాయదుర్గంటౌన్: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం గాంధీ వర్ధంతిని జరుపుకున్నారు. పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో గాంధీజీ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు జయంతి సురేష్‌కుమార్, సుబ్రమణ్యం, రేకులకుంట సత్యనారాయణ, చిందనూరు సుదర్శన్, లక్ష్మయ్యశెట్టి, వెంకటరమేష్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. సూర్యసేవా సమితి ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు.

కణేకల్లు: మండలంలోని పుల్లంపల్లి ప్రాథమిక పాఠశాలలో జాతిపితకు హెచ్‌ఎం జయరామిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. పాఠశాలలో గాంధీజీ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన పోరాటల గురించి హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

బెళుగుప్ప: మండలంలోని పాఠశాలలు, కార్యాలయాల్లో గాంధీ వర్ధంతి వేడుకలు గురువారం నిర్వహించారు. మండల కేంద్రంలోని సన్‌రైజెస్ పాఠశాలలో కరస్పాండెంట్ మారెన్న, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలసి గాంధీ చిత్రపటానికి పూలమాలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు నాగరాజు, డైరెక్టర్లు నాగభూషణ, తిప్పేస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఖబరస్థాన్‌లో పిచ్చిమొక్కల తొలగింపు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని బళ్లారి రోడ్డు ఖబరస్థాన్‌లో పిచ్చిమొక్కల దాతల సహకారంతో తొలగింపు పనులు గురువారం ప్రారంభించారు. ఇద్దరు దాతలు బాబాయ్ శారీస్ సెంటర్ ఇర్ఫాన్, రేషమ్ అమాన్‌లు రూ.23 వేలతో కూలీలతో ఒప్పందం కుదుర్చుకుని పనులను ప్రారంభించారు. పనులను ఖబరస్థాన్ కమిటీ సభ్యులు అబ్దుల్ మజీద్‌సాబ్, ఖాజీ సైపుల్లాలు పర్యవేక్షించారు.

రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

బొమ్మనహాళ్: బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ విజయభాస్కర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి బీసీ కార్పొరేషన్ రుణాల కోసం బీసీలు, ఈబీసీలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీసీ-ఏ 18, బీసీ-బీ 13, బీసీ-డీ 6, బీసీ-ఈ 6, మొత్తం 43, కమ్మ-1, రెడ్డి-1, ఈబీసీ-2 రకాల స్వయం ఉపాధి యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 30 నుంచి వచ్చే నెల 7 వరకు అవకాశం ఉందన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఉరవకొండ (విడపనకల్లు): విడపనకల్లులోని వ్యవసాయ కార్యాలయ గోడౌన్ వద్ద కందుల కొనుగోలు కేంద్రాన్ని మార్క్‌ఫెడ్ సంస్థ గురువారం ప్రారంభించింది. ఏపీ మార్క్‌ఫెడ్ సౌజన్యంతో విడపనకల్లు ఎంఏఏసీసీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఏఓ పెన్నయ్య, సొసైటీ ప్రతినిధి భాస్కర్‌నాయుడు మాట్లాడతూ రైతులు ఖరీఫ్ 2024లో పండించిన విత్తనాన్ని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కందులు క్వింటా రూ.7,550తో కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థుల భవితపైనే దేశ భవిష్యత్

గుమ్మఘట్ట: దేశ భవిష్యత్తు విద్యార్థుల భవితపై ఆధారపడి ఉందని ఎంఈఓ-1 నాగమణి, ఎంఈఓ-2రామచంద్ర తెలిపారు. మండలంలోని చౌళూరు ప్రాథమిక పాఠశాలలో రజతోత్సవం గురువారం నిర్వహించారు. గతంలో పనిచేసిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం సుశీలమ్మ,ఉపాధ్యాయులు ఫారూక్, నాగరాజు, జీవిత,వీనాకుమారి,శైలజ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

కంబదూరు: కంబదూరులో అంబేడ్కర్ భవన నిర్మాణ స్థలాన్ని ఆర్డీఓ వసంత బాబు గురువారం పరిశీలించారు. ఆర్డీఓ మాట్లాడుతూ త్వరలోనే అంబేడ్కర్ భవన నిర్మాణాన్ని చేపడతామన్నారు. ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ బాల కిషన్‌ను ఆదేశించారు. అనంతరం సివిల్ సప్లై స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేశారు. అక్రమాలకు పాల్పడితే చర్యలుంటా యని హెచ్చరించారు. వీఆర్వో సంజీవ్ పాల్గొన్నారు.

వివరాలు నమోదు చేసుకోండి

కళ్యాణదుర్గం రూరల్: నియోజకవర్గంలోని మతిస్థిమితం లేని వారికి చికిత్స చేయించేందుకు మదర్, చైల్డ్ స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చింది. మతిస్థిమితం లేని వారి వివరాలు ఈ నంబర్‌కు 9642851256లో తెలియజేయాలని మదర్ చైల్డ్ ప్రోగ్రాం డైరెక్టర్ ఆర్‌కే అలెగ్జాండర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలను తెలియజేస్తే చికిత్స చేయిస్తామన్నారు.

సాకే హరిని అరెస్టు చేయడం అన్యాయం

కంబదూరు: ఆన్‌లైన్‌లో పేకాట ఆడి రెడ్ హ్యాండెడ్‌గా పట్టు బడిన డీఆర్వో మలోలపై చర్యలు తీసుకోవాలని మంత్రి సవితను కలవడానికి వెళ్లిన ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరిని అరెస్టు చేయడం దారుణమని ఎస్సీ, ఎస్టీ మండల నాయకులు అన్నారు. సాకే హరి అరెస్టును ఖండిస్తూ కంబదూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎస్సీ, ఎస్టీ జేఏసీ మండల అధ్యక్షుడు కురాకుల పల్లి రమేష్, సీనియర్ నాయకులు నాగేంద్ర, గోపాల్, నారాయణ తదితరులు నిరసన వ్యక్తం చేశారు.

పోస్టర్ల విడుదల

వజ్రకరూరు: విజయవాడలో జరగనున్న ఎమ్మార్పీఎస్ జాతీయ సభ కరపత్రాలను నాయకులు గురువారం విడుదల చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏసన్న మాట్లాడారు. నాయకులు రాజు, మధు, సుధా కర్, సుమన్‌బాబు పాల్గొన్నారు.

అర్హులకు 3 సెంట్ల స్థలం ఇవ్వండి

కణేకల్లు: అర్హులైన పేద, నిరుపేద ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 3 సెంట్ల స్థలం ఇవ్వాలని సీపీఐ కార్యదర్శి గౌస్‌పీర్ డిమాండ్ చేశారు. గురువారం ఇందిరమ్మ కాలనీ శివారులో పేద, నిరుపేద ప్రజలతో సమావేశం నిర్వహించారు. సీపీఐ కార్యదర్శి మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు గ్రామాల్లో ఉండే అర్హులైన పేదలకు 3 సెంట్ల స్థలం ఇస్తామని హామీ ఇచ్చి, ఆ తర్వాత పట్టించుకోలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో కణేకల్లు మండల సీపీఐ సహాయ కార్యదర్శి బషీర్, నాయకులు కాకిడి జిలాన్, జనార్దన్ పాల్గొన్నారు.

చిరుత సంచారంతో ఆందోళన

బెళుగుప్ప: ఆవులెన్న బెళుగుప్ప గ్రామాల మధ్య చిరుత సంచారంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. రెండు గ్రామాల మధ్య సంచార జాతుల వారు తాత్కాలిక గుడిసెల్లో నివాసం ఉంటున్నారు. పెంపుడు కుక్కలపైనా చిరుత దాడి చేసిందని రైతులు నారాయణస్వామి, ఎర్రిస్వామి తెలిపారు.

ఉపాధి బిల్లులు ఇవ్వాలని వినతి

కుందుర్పి: మండల వ్యాప్తంగా ఉపాధిహామీ పనుల బిల్లులు ఇవ్వలేదని పలు గ్రామాల ఉపాధి కూలీలు ఎంపీడీఓ శంకర్‌కు గురువారం విన్నవించారు.

కళ్యాణదుర్గంలో 'కాఫీ విత్ పార్టీ కేడర్'



కళ్యాణదుర్గంలోని ఓ టీ స్టాల్ వద్ద స్థానికులతో ముచ్చటిస్తున్న తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గురువారం పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి 'కాఫీ విత్ పార్టీ కేడర్...' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి టీ సేవిస్తూ ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ముచ్చటించారు. టీ స్టాల్లో స్థానికులతో సైతం పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, పార్టీ నాయకులు రేవన్న గౌడ్, యర్రంపల్లి కృష్ణమూర్తి, గోళ్ల సూరి, తలారి సత్తి, నాగరాజు, నరేంద్రరెడ్డి, పరంధామరెడ్డి, పాతలింగ, షేక్షావలి, రామాంజనేయులు, మురళి, రామిరెడ్డి, రఘు, బాషా పాల్గొన్నారు.


పశువుల దాడిలో గాయపడిన గౌరమ్మకు పరామర్శ

బ్రహ్మసముద్రం : మండలంలోని కోనాపురంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధరప్ప భార్య గౌరమ్మను సమన్వయకర్త తలారి రంగయ్య గురువారం పరామర్శించారు. గౌరమ్మ పొలం పనులకు వెళ్తుండగా పశువులు పోట్లాడుకుంటూ దాడి చేశాయి. ఈ దాడిలో గౌరమ్మ గాయపడింది. కుటుంబ సభ్యులు ఆమెను కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కార్యాక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్‌కుమార్, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు రేవన్న, జిల్లా అధికార ప్రతినిధి గోపారం శ్రీనివాసులు, ఎర్రంపల్లి కృష్ణమూర్తి, గోళ్లసూరి, పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, పరంధామరెడ్డి, పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

రాయదుర్గంటౌన్: ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు దాదాపు 20 డిమాండ్లతో కూడిన మెమొరాండంను డిపో మేనేజర్ శ్రీనివాసరావుకు గురువారం అందించారు. ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు సిద్దేశ్వర్లు, దామోదర్, జిలాన్, తిప్పేస్వామి, సతీష్‌కుమార్ తదితరులు మాట్లాడారు. డ్రైవర్లు, కండక్టర్ల నూతన డ్యూటీ చార్ట్‌లు వేయాలని, ఉద్యోగుల భద్రతకు 1/19 సర్కులర్‌ను అమలు చేయాలని, ఇంక్రిమెంట్లను సకాంలో కలపాలని, రద్దు చేసిన బళ్లారి-కర్నూల్ రెండు ఎక్స్‌ప్రెస్ సర్వీసులను పునద్ధరించాలని, డ్యూటీ చార్ట్ వద్ద జరుగుతున్న అవకతవకలను నివారించాలన్నారు. ట్రాఫిక్ ఇన్‌చార్జ్ ఉమాపతి పక్షపాతి వైఖరి మానుకోవాలని, గ్యారేజ్‌లో పరికరాలు అందుబాటులో ఉంచాలని కోరారు.

లక్ష్మీపతిరెడ్డి భౌతికాయానికి డీఆర్ఓ నివాళి



కూడేరు: లక్ష్మీపతిరెడ్డి భౌతికాయానికి పూలమాల వేస్తున్న డీఆర్వో మలోల

కూడేరు: కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న లక్ష్మీపతిరెడ్డి బుధవారం బుక్కరాయసముద్రం మండలంలో ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం లక్ష్మీపతి రెడ్డి భౌతికాయాన్ని ఆయన స్వగ్రామమైన గొటుకూరుకు తీసుకు వచ్చారు. డీఆర్వో మలోల, అనంతపురం ఆర్డీఓ కేశవ నాయుడు గొటుకూరుకు వెళ్లి లక్ష్మీపతి రెడ్డి భౌతికాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రీసర్వే డీటీ ప్రసాద్, వీఆర్వో కుళ్లాయి స్వామి పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీపతి రెడ్డి బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఆర్డీఓ కార్యాలయంలో లక్ష్మీపతి రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఆర్డీఓ వసంత్‌బాబు, అధికారులు లక్ష్మీపతి ఆత్మకు శాంతి కలగాలని రెండునిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులతో గదులు శుభ్రం చేయించిన ప్రిన్సిపాల్

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గదులను ప్రిన్సిపాల్ విజయలక్ష్మి విద్యార్థులతో చీపుర్లు పట్టించి శుభ్రం చేయించిన వీడియోలు సోషల్ మీడియాలో గురువారం వైరల్ అయ్యాయి. ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు బంగి శివ మాట్లాడుతూ కళాశాల స్వీపర్లతో గదులు శుభ్రం చేయించడం సరికాదన్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ విజయలక్ష్మిని అడగ్గా కళాశాల స్వీపర్ అనారోగ్యంతో సెలవులో ఉండడంతో విద్యార్థులే శుభ్రం చేసుకున్నారని తెలిపారు.

రోడ్డు భద్రతపై అవగాహన అవసరం



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ విశ్వనాథరెడ్డి

కళ్యాణదుర్గం రూరల్: విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన అవసరమని పట్టణ సీఐ యువరాజ్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ లహరి తెలియజేశారు. గురువారం పట్టణంలోని డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. సీఐ యువరాజ్ మాట్లాడుతూ నేటి యువత రహదారి భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. లైసెన్సు లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం నేరమన్నారు. ర్యాగింగ్ సరికాదని, మత్తు పదార్థాలకు బానిస కాకుండా విద్యార్థులు చదువుపై శ్రద్ధ ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయరాం రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శేషయ్య, ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు డాక్టర్ శ్రీధర్, రవిశంకర్ పాల్గొన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

రాయదుర్గంటౌన్: వాహనదారులు కచ్చితంగా హెల్మెట్, సీట్ బెల్టుతో ప్రయాణించాలని, లేనిపక్షంలో డ్రైవింగ్ లైసెన్సు రద్దు చేస్తామని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎంవీఐ కార్యాలయంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కార్లు, ద్విచక్రవాహన డ్రైవర్లకు అవగాహన కల్పించారు. అధిక శాతం హెల్మెట్ ధరించకపోవడంతోనే రోడ్డు ప్రమాదాల్లో తలకు బలమైన గాయాలై ప్రాణాలు కోల్పోతున్నట్లు తెలిపారు.